# చలమయ్య

"మాన్ప"

ఎన్నో ఏళ్ళనుంచి అలా దగ్గుతూ నేవున్నాడు చలమయ్య... పేగులంతా కదిలించేసేలాంటి పొడిదగ్గు...పాపం ఆదగ్గు చూచేవాళ్ళంతా అనేవారతన్ని గూర్చి....."చలమయ్య ఇంకెంతో కాలం బతకడు." అంత విషపుదగ్గు అది.

వేసవికాలంలో కుంచె చేత్తో పట్టుకొని గోడకు వెల్ల వేస్తూ అతనలా దగ్గుతూ నే వుండేవాడు.

"పాపం! చూసేవా! చలమయ్యకెంత కష్టమో! అసలే రోగం మనిషి! వెధవ దగ్గు కోరికేస్తోం దతన్ని...చలమయ్య యెంతోకాలం బతకడు" అనేవారు చూసిన ప్రతివారూ.

అన్ని యిళ్ళవాళ్ళకీ చలమయ్య అంటే ప్రాణమే...ఇంట్లో పండుగరోజుల్లో ఏది మిగిలినా చలమయ్యకి పెట్టకపోతే తోచేదికాదు ఎవళ్ళకీను!

తోటల్లోకి వెడితే...రైతులంతా ముంత నిండా కల్లోసి రొట్టీ అవీ పెట్టేవారతనికి... "ఇంకెంతకాలం బతుకుతాడ్రా శలవయ్య" అనేవారు వారంతా.

శీతకాలం వచ్చింది...చలి మూలాన్ని యిల్లు కదలలేక పోయేవాడు చలమయ్య, దగ్గుకూడా హెచ్చింది. ఊళ్లో జనంగా అంతా పాపం చలమయ్యకు ఏదో ఒకటి యిచ్చి వెళ్ళిపోయేవారు.

జబ్బుతో...నీరసంగా...మూలుగుతూ చలమయ్య ఇద్దరు భార్యలను కాల్చేసేడు. మొదటి పెళ్లాం దయదల్చి పెళ్లాడిందట.

ఆవిడ అందట: "కొంచెం ధైర్యంచేస్తే సరి ...ఇంకతనుమాత్రం ఎన్నాళ్లు బతుకుతాడు?"

నజ్జుచేసి ఆవిడ చనిపోయింది.

రెండవపెళ్లాం అతని డబ్బును పెళ్ళాడిందట ఆవిడ అందట: "అతన్ని నేను పెళ్లి చేసుకుంటాను. ఇంకతనుమాత్రం ఎన్నాళ్లు బతుకుతాడు? అతని ఆస్తంతా నాకుంది...తరవాత మారుమనువు."

ఆమెకూడా చనిపోయింది.

మూడవసారి యింకో పిల్లకూడా వచ్చిందట పెళ్లాడుతానంటూ...కాని చలమయ్యకు విసువెత్తింది.

అతడన్నాడట: "నేను పెళ్లిచేసుకొని ఏం సుఖపడాలి? ఐనా నేను మాత్రం యింకెంత కాలం బతుకుతాను?"

అసలు ఆ వూరంతా ముగ్గురు అన్నదమ్ములది.

మంచి స్థూలంగా...పొడుగ్గా...చూస్తే నూరేళ్ళూ జీవించడానికి అవతరించిన వాళ్లలా కనిపిస్తారు. అంకినంతమట్టుకు వాళ్లింకా భూములను కొంటూ నేవున్నారు...సరిహద్దుల్లో వుంది చలమయ్య యిల్లు...

ఎవరికిమట్టుకు వాళ్లే అనుకున్నారు "చలమయ్య యెంతోకాలం బతకడు. ఆభూమి మనం కొనఖ్లేకుండానే సంపాదించచ్చు."

మళ్లీ ఎవరికిమట్టుకు వారికే అనుమానాలొచ్చేయి...భూమి ముగ్గురులో యెవరికి చెందుతుందోనని...అంచేత అతనిదగ్గరకు పెద్దవాడు వెళ్లేడు.

"భూమిని నేను అమ్మను...మాతాత ముత్తాతలు సంపాదించిన దిది. ఐనా నేనింకెంత కాలం బతుకుతానని?" అన్నాడు చలమయ్య.

కొద్దిరోజుల్లోనే పెద్దవాడు చనిపోయాడు.

రెండోవాడు పెద్దవాణ్ణి అనుసరించాడు... మూడోవాడికి అంతకంతకి భూమిమీది కోరిక యెక్కువైంది...

అడిగేశాడు "ఏమోయ్ చలమయ్యా ఇంక నువ్వు చావనే చావవేమిటోయ్?"

"బాబూ నాలాంటి బీద ముండావాణ్ణి మీరలా అంటే ఎలాగ?...ఇంక నేను మాత్రం ఎన్నాళ్లు బతుకుతాను?" అన్నాడు చలమయ్య దీనంగా దగ్గుతూ.

మూడోవాణ్ణి కాల్చెయ్యడంకూడా చూశాడు చలమయ్య.

'అతనుమాత్రం యింకెన్నాళ్లు బతుకుతాడులే!' అన్నారు వూళ్లో వాళ్లంతా!